# నాగరికత



**అంగర వెంకట కృష్ణారావు**

మూడు రోజుల్నించీ పడుతున్న ముసురు వాన అవాళ తెల్లవారుఝామునే తెరిపిచ్చింది.

ఆకాశం స్వచ్ఛంగా వుంది. బస్సుస్టాండు బురద, నీటి గుంటలమయంగా వుంది. మూడురోజుల తరవాత తొలిసారి కనిపించిన సూర్యుడు బారెడు పైకి లేచేడు. ఎండ కరకర్లాడుతూంది. నీటి గుంటల్లో సూర్యకాంతికి కళ్ళు చెదురుతున్నాయి.

బురదనీ, నీటి గుంటల్నీ తప్పుకొని మనుషులు హడావిడిగా తిరుగుతున్నారు. కొందరు తాపీగా చుట్టలు సిగరెట్లు కాలుస్తూ పుస్తకాల షాపుల్దగ్గిర పుస్తకాలు తిరగేస్తున్నారు.

'సినిమా పాటల పుస్తకాలు, మదన కామరాజు కథలు, డిటెక్టివ్ నవలలు; కవి చౌడప్పశతకం...' అమ్మకాలు.

'ప్రేమించి పెళ్ళిచేసుకో...' లౌడ్‌స్పీకరు గొంతిక.

'బాబూ ధర్మం — అమ్మా ధర్మం' ముష్టివాళ్ళు.

'మరి వుంటానూ. వెళ్ళగానే వుత్తరం రాయి.' వీడ్కోలు మాటలు.

ఎండ కరకర పొడిచినా రివ్వున గాలి వీస్తూంది.

బస్సులు ముందుకీ వెనక్కీ డ్రిల్లు చేస్తూ ఘుర్ఘురిస్తున్నాయి.

ఉదయం యేడున్నర.

వేపూ బస్సు కోసం ఎదురు చూస్తున్నా.

దూరంగా మేదరిగూడెం. అన్నీపాకలు. ఆ చుట్టు పక్కలంతా కుళ్ళు బురద, కంపునీరు.

దూరంగా మేదరివాళ్ళు తిరుగుతున్నారు. కొందరు అక్కడే పబ్లికుగా మల విసర్జన చేస్తున్నారు.

చిన్నా పెద్దా చాలా పందులు గునగున తిరుగుతున్నాయి. అపురూపంగా వచ్చిన ఆ వుదయపు ఎండలో అవికూడా ముచ్చటగా వున్నాయి. అవి ఆనందంగా 'గుర్ గుర్' మంటూ, వంక తిరిగిన చిరుతోకలు ఆడిస్తూ, దొరికింది మేస్తున్నాయి.

పరాగ్గా యింకోవేపు చూస్తున్నా. హటాత్తుగా పంది 'గీ' అని అరిచింది. అటు చూశా. నలుగురు మనుషులు పందిని తలకిందులా మోసుకుపోతున్నారు. ఆ పంది నీరసంగా 'గీ గీ' అంటూంది.

అక్కడికి కొంచెం యెగూని తాటాకుల పోగుల్లోంచి పొగ దట్టంగా లేస్తూంది. ఆ పొగల్లోంచి మనుషులు హడావిడిగా తిరుగుతూ అవుపిస్తున్నారు. ఒకళ్లిద్దరు తాటాకులతో విసురుతూ, తాటాకు మంటల్ని రాజ బెడుతున్నారు. ఇద్దరు గొంతికిలా కూచుని చూస్తున్నారు.

మోసుకొచ్చిన వాళ్ళు పంది నక్కడ దింపేరు. అది కదల్డంలేదు. కాని ఇంకా సన్నంగా 'గీ' అంటూంది.

విసురుతున్నవాళ్ళు తాటాకులతో జోరుగా విసిరారు. చిన్న చిన్న మంటలు లేచి నాట్యం చేస్తున్నాయి. పొగ వొక స్థంభంలా ఆకాశం పొడుగునా లేచింది.

గొంతుకిలా కూచున్నవాళ్లు లేచి పందిని మంటల్లో పెట్టేరు. విసురుతున్నవాళ్ళు మరీ జోరుగా విసిరేరు. పంది వెంట్రుకలు మాడిపోతున్నాయి. కామోసు. ఒకడు దువ్వెనతో దువ్వినట్టు దేంతోనో గీస్తున్నాడు. మంటలు మరి కొంచెం లేచేయి.

గొంతుకిలా కూచున్నవాళ్ళు తిరిగి గొంతికిలా కూచున్నారు. విసురుతున్న వాళ్ళు మరీ జోరుగా విసిరేరు. కర్ర పట్టుకున్నవాడు. మరో యిద్దరు తిరిగి వచ్చినవేపు వెళ్ళేరు.

ఈ కార్యక్రమం సినిమాలో 'లాంగ్ షాట్'లా కనిపిస్తూంది.

నాక్కావలసిన బస్సింకా రాలేదు. ఇవాళ ఆలస్యంగా వస్తుందేమో. వచ్చే ప్రతి బస్సూ దూరంనించి వుదయపు యెండలో తళతళ మెరుస్తూ, నా ఆశాదీపాన్ని ప్రజ్వరిల్ల జేస్తూంది.

అక్కడ తాటాకుల మంటలు బాగా లేచాయి. పొగ సన్నగిల్లింది. జ్వాల హెచ్చింది.

పరాగ్గా వున్నా ఇటువెంపు మరో పంది 'గీ' అంది. తుళ్లిపడ్డా.

పంది వెనక్కాళ్లకి బంధం, నెత్తిమీద దెబ్బ వొకేసారి పడ్డాయి. పంది అడ్డంగా తిరగబడింది నేలమీద. బంధం బాగా పడకుండా తప్పించేందికి తన్నుకుంటుంది.

ఆ మనిషి సన్నగా పొడుగ్గా వున్నాడు. లుంగీ కట్టుకున్నాడు పొడుగాటి గిరజాల జుత్తు. అతని చేతిలో అతనికంటె పొడుగ్గా రోకలిలాంటి బలమైన కర్ర వుంది. యమదూతలా వున్నాడు.

పంది బంధం బలంగా పడనీకుండా. ప్రాణం కోసం, పంది బతుకైనా బతుక్కోసం గింజాకుంది. కళ్లు వూడినంత పనైంది. యమదూత రెండు చేతుల తోటీ రోకలియెత్తి, వెనకవెంపు నేలతాకే వరకూ ఆచపెట్టి, బలంకొద్దీ దాని చెంపమీద మోదేడు. నా మొహం ఝుమాలుమంది. పంది గజేంద్రుడిలా 'పాహి పాహి' అని వొక చావుకేక వేసింది.

దానికి చావాల్ని లేదు. పంది చావు చావాల్ని లేదు.

తిరిగి వొక విదిలింపు విదిలించింది. బంధిస్తున్న బంధాలు విడిపోయినంత పనైంది.

వెంటనే యమదూత తిరిగి రోకలి యెత్తి బలంగా పార్శ్వభాగంమీద వరసగా దభీదభీమని యిరవైసార్లు మోదేడు. దెబ్బదెబ్బకీ ఆ ప్రాణి 'గీ' పెట్టింది. గింజుకుంది. పంది ప్రాణం ప్రాణం కాదా? దానికి ప్రాణంమీద తీపిలేదా? క్రమేణా దాని స్వరం సన్నగిల్లింది. ఆ రోకలి దెబ్బలకి దాని శరీరంలో సుమారు అన్ని యెముకలూ విరిగిపోయుంటాయి.

నా కాళ్లు గబగబలాడేయి. నేల నింగి గిరగిర తిరుగుతున్నాయి. కడుపులో తిప్పేది. వాంతి వచ్చేటట్లయింది.

ఆ పందిని కూడా వాళ్లు తలకిందులా మంటల్దగ్గరకి మోసుకుపోయేరు. అక్కడ దింపేరు. ఎండలో యమదూత గిరజాలు దులుపుకుని రోకలినానుకుని నిలబడ్డాడు.

వెంటనే గొంతికిలా కూచున్నవాళ్లు లేచి పందిని మంటల్లో పెట్టేరు తాటాకులవాళ్లు జోరుగా విసిరేరు. ఎండలో మంటలు నాట్యం చేసేయి. మాడిపోయిన పంది వెంట్రుకలొకడు దేంతోనో గబగబ దుళ్ళిసేడు.

ఇంత నిర్దయగా, నిండు ప్రాణాన్ని, గట్టి ప్రాణాన్ని రోకలితో సగం తీసి, మిగిలిన సగాన్ని తాటాకు మంటల్లో కాల్చిన వీళ్లు మనుష్యులా? వీళ్లు మనుష్యులైతే నట్టి అనాగరికులు. ఇంకా అడివి మృగాల స్థాయిలో వున్నారనుకున్నా.

ఈ దారుణ సంఘటన నన్నెంతో కాలం వెంటాడింది. భగవాన్! నాకే పుట్టుకైనా ఇయ్యి. కాని పంది పుట్టుక వద్దు. ఆ యమదూత— వాడి రోకలి— తాటాకుల మంటలు— భగవాన్! నేను భరించలేను.




# రూ. 12,000 గెలుపొందండి.

**ఆల్ కరక్టు రూ. 8,000 లు: 1 తప్పునకు రూ. 1,500 లు;**
**2 తప్పులకు రూ. 1000లు: లఘువు ఎంట్రీ రూ. 1000 లు.**
(మొదటి 6 కాలముల ఆల్ కరక్టు మాత్రమే)
ఎక్కువ ఎంట్రీలు పంపిన మొదటి వారికి రు. 300లు; రెండవ వారికి రు. 200లు

## శ్రీ వేంకటరమణా అండ్ కో (రిజిస్టర్డ్) సాహిత్యపు పోటీనెం–3

[సుప్రీంకోర్టు తీర్పు ననుసరించి నడుపబడుచున్న సాహిత్యపు పోటీ]

1 ఎంట్రీ రు. 1–00; 4 ఎంట్రీలు రు. 3–00: 10 ఎంట్రీలు రు. 7–00
4 ఎంట్రీలకు ఒక లఘువు ఎంట్రీ ఉచితము. (రూ. 3–00 లకు 4 పెద్ద ఎంట్రీలు ఒక లఘువు ఎంట్రీ పంపవచ్చును. రూ. 7–00 లకు, 10 పెద్ద ఎంట్రీలు. రెండు లఘువు ఎంట్రీలు పంపవచ్చును.)

ఎంట్రీలు పంపుటకు చివరి తేదీ 8–3–71. కీసొల్యూషన్ 14–3–71 [దిన పత్రికలలో]
విజేతల పట్టిక ప్రచురణ భీమవరంలో 28–3–71. [దినపత్రికలలో కాదు]

ఆ ధా ర ము లు —

1. వాకు — — — కాని ధనము ప్రధానము కాదు. [యోగ్యతే / గుణమే]
2. తపస్సిద్ధి గలవారికి — — — స్వాధీనమే [కుశలము / మరణము]
3. ఆర్యులత్యంత — — — బుద్ధులని తోచుచున్నది [తీక్ష్ణ / సూక్ష్మ]
4. — — విడవాడి విమర్శించుకొనుము [దుష్టత్వము / మూఢత్వము]
5. వృత్తిని బట్టియే కులములేర్పడినవని — — — నిర్ణయము [శాస్త్ర / గీత]
6. హృదయము కలవాడు సజ్జనుని — — — పోవుట ఎట్లు? [ప్రేమించక / ఆదంపరిక]
7. సిసలైన — — — జీవనం చూడాలంటే పల్లెలకే పోవాలి. [ప్రజా / జాతి]
8. సంఘమున — — — వితివిహారెను [అసంతృప్తి / అహంభావము.]

నిబంధనలు 1. వాక్యము లన్నియు అచ్చు పుస్తకములనుండి గ్రహింపబడినవి. రచయిత [త్రి] వాడినపదమే సరియయినది. ఎంట్రీలలో మీరు ఎంచుకొనిన పదము వ్రాసిన సరిపోవును. 2. ఒకరు ఎన్ని ఎంట్రీలనైనను పంపవచ్చును. ఎంట్రీల రుసుము మనియార్డరు ద్వారాగాని, ఇండియన్ పోస్టల్ ఆర్డరు ద్వారాగాని పంపవలెను. ఎమ్. వో. ద్వారా పంపినచో ఎమ్.వో. రశీదు ఎంట్రీలకు జతపరచి పంపవలెను. ముందుగా సొమ్ము చెల్లించి మానుండి ప్రీ–పెయిడ్ ఎంట్రీ ఫారములను పొంది పూర్తిచేసి పంపవచ్చును. సరిపడు సొమ్ము చెల్లించని ఎంట్రీలు స్వీకరింపబడవు. 3. ఎంట్రీలు తెల్లకాగితముపై వ్రాసి పంపవచ్చును. లేదా 20 పైసలు తగ్గకుండా పది ఎంట్రీలకు 20 పైసలు చొప్పున పోస్టల్ స్టాంపులు పంపి మానుండి అచ్చు ఎంట్రీ ఫారములను పొందవచ్చును. 4. ఎంట్రీలలో తుడుపులు కొట్టివేతలు ఉండరాదు. ఎంట్రీలలో పేరు. ఎడ్రస్ స్పష్టముగా తెలుగులో వ్రాయవలెను. 5. ఒకరి కంటె ఎక్కువమంది విజేతలు వచ్చినచో బహుమతుల సొమ్ము సమానముగా పంచబడును. 6. అన్ని విషయములలోను మేనేజిమెంట్ వారిదే తుది నిర్ణయము. వివాదేవిలు అన్నియు భీమవరం కోర్టులోనే పరిష్కరించుకొనవలెను. ఆక్షేపణలున్నచో విజేతల లిస్టు ప్రచురించిన 15 రోజులలోగా 10 రూ.లు పంపుచు ఆక్షేపణ తెలుపవలెను. ఆక్షేపణ సరికానిచో 10 రూ. లు తిరిగి ఈయబడవు. 7. చివరి తేదీ నీబ్బాడ ఎంట్రీలు పంప వచ్చును. 300 రూ. లకు తగ్గని ఎంట్రీలు సేకరించు ఏజంట్లకు 15%వరకు కమిషన్ ఈయబడును. అన్నిచోట్ల ఏజంట్లు కావలెను. ఏజన్సీ నియమములకై 20 పై. ల స్వంత ఎడ్రస్ వ్రాసిన కవరు పంపండి. 8. విజేతల పేరుల లిస్టు కావలసిన వారు స్వంత ఎడ్రస్ వ్రాసిన కవరుపై 40 పైసల పోస్టల్ స్టాంపులు అంటించి పంపవలెను. "కీ సొల్యూషన్" కావలసినను, ఇతర వివరములు ఏవికావలెనన్నను స్వంత ఎడ్రస్ వ్రాసిన 20 పైసల పోస్టల్ కవరు పంపవలెను. ఎంట్రీలు, మనియార్డర్లు మొదలగునవి అన్నియు దిగువ చిరునామాకు [ఎడ్రస్‌కు] పంపండి.

**శ్రీ వేంకటరమణా అండ్ కో (రిజిష్టర్డ్) సాహిత్యపు పోటీ నెం–3**
**శ్రీ రామపురం — భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా, (A.P.) ఫోన్ నెం. 409.**

**శ్రీ వేంకటరమణా & కో (రిజిష్టర్డ్) సాహిత్యపు పోటీ నెం. 2–కిసొల్యూషన్**
1. కావ్య. 2 పద్యం. 3. ఉరగాయల. 4. పాండిత్యము. 5. విలపింతురో. 6. నివసించుటకు. 7.వ్యాసం. చిత్రమున. పై వాక్యములు 1. సాహిత్య శిల్ప సమీక్ష బై శ్రీ పింగళిలక్ష్మీ కాంతము. 2 హాస్యకథలు శ్రీ చింతా దీక్షితులు. 3. కాశీమజిలీ కథలు. బై. శ్రీ మధిర సుబ్బన్న దీక్షితకవి. 4. గణపతి బై శ్రీ కమర్తి లక్ష్మీనరసింహమ్మ అను గ్రంథములనుండి గ్రహింపబడినవి. విజేతల పట్టిక దిన పత్రికలలో ...ంపబడును. విజేతల పట్టికకై స్వంత ఎడ్రస్ వ్రాసిన కవరుపై 40 పైసల పోస్టల్ స్టాంప్స్ పంపి... 2–71 తేదీకి తరువాత పంప బడును.


# నాగరికత

ఈ ఉదంతం జ్ఞాపకం వచ్చినప్పుడల్లా, నేను పంది పుట్టుక్కి పుడతానా — అమ్మో! అని ముచ్చెమటలు పోసి పోయేవి. ఆ యమదూత రోకలి నాకళ్ల ముందు నాట్యం చేసేది.

కాని కాలక్రమేణా ఆ భయంకర యజ్ఞాకాండ నా స్మృతి పథంలో చెరిగిపోయింది.

కొన్నాళ్ల తరవాత ఒక సాయంత్రం నేనొక పెద్ద డిపార్టుమెంటలు స్టోర్సుకి వెళ్లా. అక్కడ జనం కిటకిటలాడుతున్నారు.

నేను స్టోర్సు లోపలికి వెడుతూంటే, యెదురుగా ఒక పురుషుడూ ఒక స్త్రీ వస్తున్నారు. వాళ్లు బహుశా దంపతులయుంటారు. తెల్లగా, ఆరోగ్యంగా, దేవతల్లా వున్నారు. అతను ఖరీదైన సూటు తొడుక్కున్నాడు. ఆ యువతి సరికొత్త రకం చీర యౌవనపు పొంగు స్పష్టంగా కనిపించేలా ధరించింది. వాళ్ల మొహాల మీద చిరునవ్వు వెలుగుతూంది. వాళ్లు రూపం ధరించిన నాగరికత, నడుస్తూన్న సభ్యతలా వున్నారు. ఇద్దరి చేతుల్లోనూ అందమైన ప్లాస్టిక్కు సంచులున్నాయి. ఆ యువతి పట్టుకొన్న సంచీలో, పైకపుపిస్తూ ఒక రంగురంగుల, అందమైన డిజైను గల చిన్న డబ్బా వుంది. ఆ డబ్బామీద ఇంగ్లీషులో 'బేకన్' అని వుంది. నా దృష్టి దానిమీద పడింది.

వెంటనే నా తల తిరిగింది. నా కాళ్ల కింద నేల, స్టోర్సు పైకప్పు గిరగిర తిరుగుతున్నై.

భగవాన్! ఎవడు వాడు! గిరజాల జుత్తు. పొడుగ్గా లుంగీ రోకలిలాంటి పొడుగాటికర్ర వెనకవెంపు భూమి తాకే వరకూ ఆచి పెట్టి బలంకొద్దీ మోదుతున్నాడు. ప్రభూ! ఈ వేదన భరించలేను. ప్రాణం పోతూంది. పాహి పాహి— అని పంది గీపెడుతూంది.

అందమైన రంగురంగుల డబ్బా నాగరికతకి చిహ్నం. అందులో వున్న పంది యేమిటో? దుస్తులు నాగరికతకి చిహ్నం, ఆ దుస్తుల్లో వున్న మనుషులో? ●